

ఫిట్ ఇండియా ప్లెడ్జ్


ప్రతిజ్ఞ చేస్తున్న కోచ్‌లు, ట్రైనర్లు

ప్రజాశక్తి - ఏలూరు

నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఫిట్ ఇండియా ప్లెడ్జ్ నిర్వహించామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఫుట్‌బాల్ కోచ్ ఎమ్‌డి.సిరాజుద్దీన్, అథ్లెటిక్ కోచ్ జి.కృష్ణకుమారి, హ్యాండ్‌బాల్ కోచ్ ఆర్.మోహన రవికుమార్, స్కేటింగ్ కోచ్ ఎస్‌కె.ఖాసిం, స్విమింగ్ కోచ్ బి.గణేష్, బ్యాడ్మింటన్ కోచ్ కె.శివనాగు, ట్రైనర్లు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సిబ్బంది మొత్తం 200 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏలూరులో వైసిపి ఖాళీ..!


నేడు టిడిపిలో చేరనున్న మేయర్ దంపతులు

అదేబాటలో బొద్దాని శ్రీనివాస్, మైబాబు మరో 30 మంది వైసిపి కార్పొరేటర్లు

ఇప్పటికే మాజీ మంత్రి ఆళ్ల నాని వైసిపికి గుడ్‌బై

మేయర్ దంపతుల చేరికపై టిడిపి నేతల్లో భిన్నాభిప్రాయాలు

ఏలూరు మేయర్ నూర్జహాన్‌ను మార్చాలంటూ నాయకుల్లో చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నియోజకవర్గంలో వైసిపి ఖాళీ అవుతోంది. ఇప్పటికే మాజీ మంత్రి ఆళ్ల నాని పార్టీ పదవులతోపాటు పార్టీ సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. అంతకుముందే ఏలూరు నియోజకవర్గంలో ఆళ్ల నాని తర్వాత కీలక నేతలుగా పేరొందిన బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబు వంటివారు పార్టీకి రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాకముందు, ఆ తర్వాత ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, ఆమె భర్త పెదబాబు టిడిపికి అనుకూలురుగా మారారు. మేయర్ పదవిని కాపాడుకునేందుకు మేయర్ దంపతులు టిడిపి గూటికి చేరుతున్నారనే ప్రచారం పెద్దఎత్తున సాగింది. మేయర్ దంపతులతోపాటు ఇతర వైసిపి కీలక నేతలంతా టిడిపిలో చేరనున్నట్లు కొద్దికాలంగా ప్రచారం సాగుతునప్పటికీ జరగలేదు. అయితే ఈ నెల 27వ తేదీ మంగళవారం మేయర్ దంపతులతోపాటు, దాదాపు 30 నుంచి 35 మంది వైసిపి కార్పొరేటర్లు, వైసిపిలో కీలక నేతలుగా కొనసాగిన బొద్దాని శ్రీనివాస్, మంచెం మైబాబుతోపాటు మరికొంతమంది నాయకులు ముఖ్యమంతి చంద్రబాబు, మంత్రి లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సాయంత్రం వైసిపి పదవులకు, ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులు తమ రాజీనామా లేఖలను విడుదల చేశారు. అనంతరం విడుదల చేసిన ఒక ప్రకటనలో తాము వ్యక్తిగత కారణాల రీత్యా టిడిపిలో చేరుతున్నట్లు ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు పేర్కొన్నారు. తమ భావనను ప్రజలు అర్థం చేసుకుంటారని అనుకుంటున్నామని, ఎప్పటిలానే ఏలూరు నగర ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ చేయగలిగినంత సేవ చేస్తామని, నగర ప్రజలు ఎప్పటిలానే తమపై ప్రేమాభిమానాలు చూపాలని కోరారు. ఏలూరు నియోజకవర్గంలోని కీలక నేతలంతా టిడిపిలో చేరడంతో వైసిపి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మేయర్ దంపతుల చేరికపై టిడిపిలో భిన్నాభిప్రాయాలు

ఏలూరు మేయర్ నూర్జహాన్, పెదబాబు దంపతులు టిడిపిలో చేరికపై ఆ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మేయర్ దంపతులను పార్టీలో చేర్చుకోవడాన్ని చాలామంది టిడిపి నాయకులకు ఇష్టం లేదని తెలుస్తోంది. గడిచిన పదేళ్లలో జరిగిన విషయాలను వారు గుర్తు చేసుకుంటున్నారు. 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చింది. ఏలూరు ఎంఎల్ఎగా బడేటి బుజ్జి గెలుపొందారు. ఆ తర్వాత ఏలూరు కార్పొరేషన్ ఎన్నికలు వచ్చాయి. మేయర్ అభ్యర్థిత్వంపై అంతా మల్లగుల్లాలు పడుతుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ రాజకీయాలతో సంబంధం లేని ఎస్ఎంఆర్.పెదబాబు భార్య నూర్జహాన్‌ను మేయర్ అభ్యర్థిగా బడేటి బుజ్జి నిర్ణయించారు. ఆ ఎన్నికల్లో టిడిపి అఖండ విజయం సాధించడంతో ఐదేళ్లు మేయర్‌గా నూర్జహాన్ పెదబాబు కొనసాగారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు ఎంఎల్ఎ బడేటి బుజ్జికి, మేయర్ దంపతుల మధ్య బేధాభిప్రాయాలు ఏర్పడ్డాయి. దీంతో ఎన్నికల సమయంలో మేయర్ దంపతులు ఆళ్ల నాని సమక్షంలో వైసిపిలో చేరి నానికి ఎన్నికల్లో తమ వంతు సహకారం అందించారు. ఆ ఎన్నికల్లో బడేటి బుజ్జి 4,072 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. కేవలం 2.52 శాతం ఓట్ల తేడాతో బుజ్జి ఓటమి పాలయ్యారు. మేయర్ దంపతులు వైసిపిలోకి వెళ్లి టిడిపికి అనుకూలమైన మైనార్టీ ఓట్లతోపాటు తమ అనుకూల ఓటర్లను వైసిపికి వేయించారని, అందువల్లే బుజ్జి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారని అప్పట్లో టిడిపి నాయకుల్లో తీవ్ర చర్చసాగింది. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లోనూ షేక్ నూర్జహాన్ పెదబాబు వైసిపి తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి పదవి చేపట్టారు. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు మళ్లీ మేయర్ దంపతులు టిడిపిలోకి చేరేందుకు సిద్ధమయ్యారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఏలూరులో తమను మేయర్ దంపతులు తీవ్ర ఇబ్బందులు పెట్టారని టిడిపి నాయకులు చెబుతున్నారు. అటువంటి వారిని పార్టీలోకి ఏవిధంగా చేర్చుకుంటారనే చర్చ టిడిపిలో విస్తృతంగా సాగుతోంది.

మేయర్‌ను మారిస్తే ఓకే..!

మేయర్ దంపతులను పార్టీలోకి చేర్చుకున్నప్పటికీ మేయర్‌గా మాత్రం వేరొకరిని నియమించాలని టిడిపి నాయకులు గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. 50 మందికిగాను 35 మంది కార్పొరేటర్లు టిడిపిలో చేరితే మేయర్ పీఠం టిడిపి కైవసం అవుతోంది. మేయర్ నూర్జహాన్‌తో రాజీనామా చేయించి టిడిపిలో కష్టపడిన వారికి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నాయకుల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే టిడిపి నాయకుల్లో ముఖ్యనేతను కోఆప్షన్ సభ్యునిగా నియమించి మేయర్ పదవి ఇవ్వాలనే ప్రచారం సాగుతోంది. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి నిర్ణయాన్ని బట్టి మేయర్ మార్పు ఉంటుందని అంతా చెబుతున్నారు. ఆయన పాతవి మర్చిపోయి ముందుకు సాగుతారా.. లేక మేయర్ మార్పు చేస్తారా అనేది రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మేయర్ దంపతుల చేరిక, పరిణామాలపై ఎంఎల్ఎ చంటి తీరుసైతం చర్చనీయాంశమవుతోంది.


పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

రెండు పూటలా తాగునీరందిస్తాం

కలాం పార్క్‌లో బోటు షికారు ఏర్పాటు - మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణ ప్రజలకు రెండు పూటలా తాగునీరందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎపిజె అబ్దుల్ కలాం హెల్త్ పార్క్, కుళాయి చెరువు, ఎంఎల్‌డి.ఫిల్టరేషన్ ప్లాంటును మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పార్కు చెరువుకు జెట్టీలు ఏర్పాటు చేసి బోటు షికారు ఏర్పాటు చేసి పర్యాటకులను మరింత ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని మున్సిపల్ అధికారులను మంత్రి ఆదేశించారు. కుళాయి చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని, తాగునీటి చెరువును పరిశుభ్రంగా ఉంచి, పాదచారులకు ఏ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ సురక్షితమైన తాగునీటితోనే ఆరోగ్యం సాధ్యమని, తాగునీటి పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ఆనాడు రూ.15 కోట్లతో పంపులు, ఫిల్టర్ బెడ్లు, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు పూర్తి చేశామని చెప్పారు. అయితే దానికి అనుగుణంగా పైపులైను విస్తరణ జరగకపోవడం వల్ల గంట మాత్రమే తాగునీరు వస్తుందని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో పెరగబోయే జనాభాను దృష్టిలో పెట్టుకుని మరో 10 ఎంఎల్‌డి కెపాసిటీ పెంచడానికి అంచనాలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి, మున్సిపల్ ఇంజినీర్ కె.రాజకుమార్, ఎఇ ఎం.సాంబశివుడు, నాయకులు జివి, పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, రావూరి సుధ, కర్నేని గౌరునాయుడు, మహ్మద్ జానీ, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, బుగ్గే ఆనంద్, పొట్నూరి శ్రీనివాస్, సిడగం సూర్య, బత్తుల నిర్మలాకుమారి, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ తప్ప మరే పెన్షన్ స్కీమ్ అంగీకరించం

30న పాత తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు - యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాల్సిన ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయకుండా యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) తీసుకురావడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. తక్షణం దేశమంతటా పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 30న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలా యుపిఎస్‌ను ముందుకు తీసుకురావడం తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు. సిపిఎస్ కంటే మెరుగైనది యుపిఎస్ అంటూ కేంద్రం అంకెల గారడీ చేసిందని విమర్శించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధం లేకుండా అన్ని రకాల సదుపాయాలు ఉండే పాత పెన్షన్ కంటే మరేదీ అంగీకారం కాదని పేర్కొన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకొచ్చిందని, దీనిని యుటియఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జిపిఎస్ అమలుకు ముందుకొస్తే నిరసనలు వెల్లువెత్తడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసిందని పేర్కొన్నారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ ఏదైనా పెన్షన్ ఉద్యోగుల హక్కు, భిక్షకాదు అని చెప్పిన సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నమైనవని విమర్శించారు. తక్షణం పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.


దుంపగడపలో ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

బాలిక కుటుంబానికి సిపిఎం పరామర్శ

ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా


ఎంఎల్ఎతో మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని దుంపగడపలో దుర్గా లహరి (16) ఇటీవల జ్వరంతో మరణించడం ప్రభుత్వ వైద్యరంగంలో లోపాలకు నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. సిపిఎం బృందం సోమవారం గ్రామంలో బాలిక కుటుంబాన్ని పరామర్శించింది. ఈ సందర్భంగా దుంపగడప వినాయకుడి గుడి సెంటర్లో ధర్నా నిర్వహించారు. అదే సమయానికి అక్కడికి వచ్చిన ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ దుంపగడపలో విషజ్వరాలు ప్రబలి గ్రామానికి చెందిన నిడుమోలు దుర్గా లహరి ప్రభుత్వాసుపత్రిలో చేరిందన్నారు. అక్కడ ఇజెంక్షన్‌లు చేశాక విరోచనాలు, వాంతులు పెద్దగా కావడంతో పల్స్ హాస్పిటల్‌లో చేర్చగా రెండు గంటల ముందు తీసుకొస్తే బాలిక బతికేదని వైద్యులు చెప్పారన్నారు. కొన్ని ప్రభుత్వాసుపత్రుల్లో నెలకొన్న నిర్లక్ష్య వైఖరి ఫలితమే బాలిక మృతి అని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ మరణంపై దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, గ్రామంలో అందరికీ పరీక్షలు నిర్వహించి పక్కా డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. తాగునీటి చెరువును ఆనుకుని రొయ్యల చెరువు ఉందని, దీన్ని నివారించి దుంపగడప ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి ప్రాణాలు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కె.తవిటినాయుడు, డోకల లక్ష్మి, పెంకి అప్పారావు, డోకల రవితేజ, బొడ్డుపల్లి రాంబాబు, ఆర్.రాయ్‌ప్రసాద్, ముువ్వ శ్రీను, కందాల వెంకటేశ్వరరావు, ఎన్నే రత్తయ్య, బొర్రా శ్రీను, కడలి సత్యనారాయణ, కడలి వాసు పాల్గొన్నారు.

విచారణ జరిపిస్తాం: ఎంఎల్ఎ

దుంపగడపలో ఇటీవల బాలిక దుర్గాలహరి మరణంపైనా, జ్వరాలపైనా పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు సిపిఎం శ్రేణులకు హామీ ఇచ్చారు. సోమవారం దుంపగడపలో దుర్గాలహరి తల్లిదండ్రులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు ఇచ్చిన వినతిపత్రంపై ఎంఎల్ఎ స్పందించి మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకు మూడు గ్రామాలు ఈ రకమైన సమస్యను ఎదుర్కొంటున్నాయని, అందులో ప్రధానంగా రెండు గ్రామాలు మరింత సమస్యాత్మకంగా ఉన్నాయన్నారు. ఆ రెండింటిలో దుంపగడప ఒకటి అన్నారు. గ్రామంలో జరిగిన మరణంతో పాటు జ్వరాలపైన పూర్తిస్థాయిలో విచారించేందుకు విచారణాధికారిని త్వరలో నియమిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సమన్వయ కమిటీల ఏర్పాటుకు కృషి

టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ ఎన్‌డిఎ సమన్వయ కమిటీల ఏర్పాటుకు బిజెపి, జనసేన నేతలతో చర్చిస్తున్నామని టిడిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు తెలిపారు. భీమవరం నియోజకవర్గంలోని వీరవాసరం, భీమవరం మండల కమిటీల సమావేశం సోమవారం తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన ఆ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథి రామరాజు మాట్లాడుతూ గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గస్థాయి ఎన్‌డిఎ సమన్వయ కమిటీల ఏర్పాటు త్వరలోనే జరుగుతుందన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామాలాభివృద్ధికి సిఎం, డిప్యూటీ సిఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేంద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజును సత్కరించారు. సమావేశంలో వీరవాసరం మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాస్, వీరవల్లి శ్రీనివాస్, భీమవరం మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పర్విశంకర్, వీరవాసరం ఎంపిపి వీరవల్లి దుర్గభవాని, మాజీ ఎంపిపి బర్రె నెహ్రూ, జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్, భీమవరం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్, నేతలు కోళ్ల నాగబాబు, ఆడిదేల చిరంజీవి, కడలి వాసు, బొడ్డు మోహన్ తదితర నేతలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామరాజు

ప్రతిభకు పేదరికం అడ్డుకాదు : ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి యరకరాజు శ్రావ్యవర్షిణికి బస్సు ఫీజు నిమిత్తం రూ.15 వేలు దిరుసుమర్రు చంటి రాజు సహకారంతో ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ చదువుకుని ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణాధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, చల్లా రాము, కొప్పినిడి బాబీ, కారుమూరి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

యువత సేవాభావం అలవర్చుకోవాలి

పేదల కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్లకు దాతలందిస్తున్న సహకారం అద్వితీయమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం అనాకోడేరు మాజీ సర్పంచి వనిమ రుద్ర భాస్కరరావు అన్న క్యాంటీన్‌కు రూ.10,116 విరాళంగా ఎంఎల్ఎ అంజిబాబుకు అందించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ దాత భాస్కరరావు పుట్టినరోజు సందర్భంగా ఇటువంటి సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖ నేతలతోపాటు విజ్జురోతి రాఘవులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనవాణి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జనసేన అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి జనసేన కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సోమ, మంగళవారాల్లో రెండు రోజులపాటు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయం వద్ద వినతులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం జనసేన పార్టీ కార్యాలయ వర్గం తెలిపింది. సోమవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 50కిపైగా సమస్యలపై ఆయా శాఖాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంఎల్ఎ తెలిపారు. తాను కూడా వ్యక్తిగతంగా గుంటూరు జిల్లాకు చెందిన ఒక వికలాంగునికి ట్రై సైకిల్‌కు ఆర్థిక సహాయం అందించానని తెలిపారు. మంగళవారం కూడా తాను మంగళగిరి ఆఫీసు వద్ద అందుబాటులో ఉంటానని రాష్ట్రంలోని ప్రజలు ఎవరైనా తమ సమస్యలను విన్నవించుకునేందుకు కార్యాలయానికి రావొచ్చని ఆయన తెలిపారు. ప్రతి సమస్యనూ ప్రభుత్వమే పరిష్కరించే దిశగా అవకాశాలు లేనప్పుడు తన వంతుగా స్వంత ఖర్చుతో కొన్ని సమస్యలను పరిష్కరిస్తున్నానని ఇది రాష్ట్రానికి ఆదర్శం కావాలని ఆయన అభిలాషించారు.


సర్వ శిక్ష అభియాన్ నూతన కార్యవర్గం

ఎస్ఎస్ఎ సిఆర్‌పిల నూతన కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సమగ్ర శిక్ష అభియాన్ సిఆర్‌పిల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షులుగా బొక్కా శ్రీనివాస్ (నర్సాపురం), ప్రధాన కార్యదర్శిగా నరేష్ కుమార్ (పెనుమంత్ర), కోశాధికారిగా వెంకన్నబాబు (కాళ్ల), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎమ్‌డి.బేగం (తణుకు), ఉపాధ్యక్షులుగా నాగార్జున (భీమవరం), ఎ.సుజాత (పెనుగొండ), న్యాయ సలహాదారునిగా రాజ్‌కుమార్ (యలమంచిలి) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సిఆర్‌పిల హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖలో విలీనం చేస్తామని మాట ఇచ్చిందని, ఇచ్చిన మాట నిలబెట్టుకుని తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


మాట్లాడుతున్న ఎంఎల్ఎ అంజిబాబు

యువతతోనే అభివృద్ధి సాధ్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అన్ని రంగాల్లోనూ దేశం అభివృద్ధి చెందాలంటే యువతతోనే సాధ్యమని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పిలుపునిచ్చారు. భీమవరం మన్నా చర్చి ఆవరణలో మన్నా చర్చి యూత్ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ యువత రాష్ట్రానికి వెన్నుముకలా ఉండాలని, యువత లేనిదే ఏమీ జరగదని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో యువత వల్లే కూటమి విజయం సాధించిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు యువత ముందుకొచ్చారని, యువతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి కూడా అందిస్తామని తెలిపారు. యువత నిరాశతో ఉండకూడదని, ధైర్యంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పాస్టర్లు సన్నీ జోసెఫ్, సారా గ్రేస్, మన్నా చర్చి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే సమాజం వికాసం చెందుతుందని తెలుగురైతు విభాగం ఆచంట నియోజకవర్గ అధ్యక్షులు వెలగల బుల్లి రామిరెడ్డి అన్నారు. బ్రాహ్మణచెర్వు వెలుగు శాఖ ద్వారా బ్యాంక్ లింకేజీ మహిళా రుణాలకు చెందిన చెక్కులు ఆయన పలువురు మహిళా చిరు వ్యాపారులకు అందజేశారు. వెలుగు శాఖ ద్వారా పొందుతున్న బ్యాంక్ లింకేజీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాహ్మణచెర్వులోని మండల సమాఖ్య కార్యాలయంలో వ్యాపార పరమైన రుణాలకు సంబంధించి మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎపిఎం విజయకుమారి మాట్లాడుతూ సోమరాజు ఇల్లింద్రపర్రు, వెలగలవారిపాలెం, పొలమూరు, మామిడూరు, ఓడూరు, మార్టేరు గ్రామ పరిధిలో మహిళా వ్యాపారాభివృద్ధి కింద రూ.12 లక్షల రుణాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కె.ప్రసాదరెడ్డి, టిడిపి మండలాధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, కస్టర్ ఇన్‌ఛార్జి చింతపల్లి రామకృష్ణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ, పలువురు నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు 8 గ్రాముల బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలోని మావుళ్ళమ్మవారికి హైదరాబాద్‌కు చెందిన ఎం.మోహన్‌బాబు, శ్రావణి దంపతులు 8 గ్రాముల బంగారాన్ని ఆలయ అధికారులకు సోమవారం విరాళంగా అందజేశారు. వారికి ఆలయ ఉప ప్రధానార్చకులు కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశామని ఆలయ సహాయ కమిషనర్ బుద్ద మహాలక్ష్మి, నగేష్ తెలిపారు.


తాడేపల్లిగూడెం : వాణీ పబ్లిక్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి గొల్లగూడెంలోని యాదవ యూత్ సభ్యులు కృష్ణుని విగ్రహాన్ని గ్రామంలో మేళ తాళాలతో బాణాసంచా కాల్పులతో ఊరేగించారు. అనంతరం రాత్రి గొల్లగూడెంలోని యువకులు ఉట్టి కొట్టారు. ఉట్టిగట్టిన యువకులకు ప్రోత్సాహక బహుమతులను యూత్ సభ్యులు అందజేశారు.

పాలకొల్లు : కృష్ణాష్టమి సందర్భంగా పాలకొల్లు కెనాల్ రోడ్డులోని శ్రీకృష్ణ ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. కమిటీ అధ్యక్షులు మన్నే శ్రీనివాస్ దంపతుల చేతులు మీదుగా యాత్రికులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాన్ని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గాదె వెంకన్న సందర్శించారు. సాయంత్రం 12 సంవత్సరాల్లోపు బాల బాలికలకు, శ్రీకృష్ణుడు, గోపికమ్మల, వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

తాడేపల్లిగూడెం : భగవద్గీత అందరూ అనుసరణీయమైన ఆధ్యాత్మిక గ్రంథమని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, వాణీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ వాణీకృష్ణ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని స్థానిక సుబ్బారావుపేట వాణీ పబ్లిక్ స్కూల్లో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బృందావనమాలి కృష్ణా అనే కోలాట నృత్య ప్రదర్శన పలువురి ప్రశంసలందుకుంది. అనంతరం వాణీ పబ్లిక్ స్కూల్ ప్రయిమరీ ఇన్‌ఛార్జి బి.జానకీదేవి, జి.శాంతిమణి ఆధ్వర్యంలో విద్యార్థులచే ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణునిగా వేషధారణులు ఆర్.తేజ, అక్షిత, దేవ వర్షిణి, తేజస్విన్, గణపతిలకు గోపికలుగా వేసిన కార్తీశ, తేజస్వినిలకు బహుమతులు వాణీ పబ్లిక్ స్కూల్ అధినేత కృష్ణ అందజేశారు.

ఉండి : వాడవాడలా శ్రీకృష్టామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉండి కొత్తపేటలో వేంచేసియున్న శ్రీ కష్ణచైతన్య ఆశ్రమంలో సోమవారం పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. చరిత్ర ప్రసిద్ధి చెందిన ఉండి శ్రీకష్ణ చైతన్య ఆశ్రమంలో కష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేణుగోపాల యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉండి పురవీధుల్లో స్వామివారిని ఎద్దుల బండి పై తీన్మార్ డప్పులతో ఉదయం నుండి సాయంత్రం వరకూ ఊరేగించి సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. బుధవారం అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాలని వేణుగోపాల యాదవ సంఘం సభ్యులు కోరసిక వెంకట కుమార్, కందుల బాలాజీ తదితరులు తెలిపారు.


జనవాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న నేతలు

జనవాణిలో ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు. ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి నమోదు చేసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం

జిల్లాలో ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రపంచ శాంతిదూత మదర్ థెరిస్సా సేవలు చిరకాలం నిలిచి ఉంటాయని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం మండలంలోని నెగ్గిపూడి, కోడేరు రోడ్డులోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, జాతీయ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సాకరాజు ఆధ్వర్యంలో థెరిస్సా విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమాజ సేవకులు వెలగల అమ్మిరెడ్డి, చిర్ల శ్రీనివాస రెడ్డి, చదువుల నరేంద్రను సత్కరించారు. అలాగే కర్రి సత్తిరెడ్డి, విజయలక్ష్మి జ్ఞాపకార్థం సంస్థ అధ్యక్షులు కర్రి మురళి శ్రీనివాసరెడ్డి, మల్లిక రెడ్డి ఆర్థిక సహాయంతో వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత నక్కా నరేష్ కుమార్, మానవత బండి ప్రసాద్, జై భీమ్ తీన్మార్ బృందం పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యాన కాశిపాడు ఆరోగ్య ఉపకేంద్రం వద్ద మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకులు నామాలరాజు మాట్లాడారు. అనంతరం మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విగ్రహం దాత కోట ఆదినారాయణ, పిఎంపి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కెఆర్‌కె.పరమేశ్వర్లు, మత్తి శ్రీను పాల్గొన్నారు.

గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రోగులు, పేదలకు, పండ్లు, పాలు, పులిహోర, అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు పచ్చిపులుసు నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్‌పర్సన్ కె.సత్యనారాయణ మూర్తి, కోశాధికారి, విశారధ పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా


నరసాపురం : పేదలకు టవల్స్ అందజేస్తున్న సభ్యులు

నిర్వహించారు. తొలుత మదర్ థెరిస్సా విగ్రహానికి రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, వనితా క్లబ్ రీజనల్ ఛైర్‌పర్సన్ శిరిగినీడి రాజ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎక్కడో యుగోస్లేవియాలో పుట్టి తన సేవలు అందించడానికి భారతదేశానికి వచ్చారన్నారు. కుష్టు రోగులకు అన్నీ తానై తన సేవలతో ఆరోగ్యవంతులుగా చేసి సమాజానికి అందించినటువంటి సేవా తపస్వి మదర్ థెరిస్సా అన్నారు. అటువంటి సేవాతత్పరురాలిని స్మరించుకోవడం అందరి బాధ్యత అన్నారు. జనసేన అధికార ప్రతినిధి దివి సత్యన్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా సమితి ఆధ్వర్యంలో తాము కూడా ప్రతి సంవత్సరం సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం పేదలకు టవల్స్, టీ షర్ట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు పుష్పాల ఉమామహేశ్వరి, కార్యదర్శి బండి స్వర్ణలత, ఉపాధ్యక్షురాలు పుష్పాల ఉషాకమల, గంటా వెంకటరమణ, నాగమణి పాల్గొన్నారు.

ఉండి : మదర్ థెరిస్సా సేవలు ఎనలేనివని ఉండి పిహెచ్‌సి వైద్యాధికారి బి.సాయిచంద్ర అన్నారు. సోమవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి చంద్ర, అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు, క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు మాట్లాడారు. అనంతరం వృద్ధులు, రోగులకు పండ్లు రొట్టెలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రుద్రరాజు నరసరాజు, బొండాద కేశవరావు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడు : మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదర్శ లయన్స్ క్లబ్, ఆకివీడు లయన్స్, అభయ లయన్స్, గోల్డెన్ అక్వా లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వద్ద మదర్ థెరిసా విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ సేవలందిస్తున్న నర్సులను సన్మానించారు. రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. డిఎంహెచ్ఒ ఉమామహేశ్వరరావు లయన్స్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆదర్శ లయన్స్ క్లబ్ కార్యదర్శి మోర జ్యోతిరెడ్డి, ఆకివీడు ఆదర్శ క్లబ్ అధ్యక్షులు కంభంపాటి నరసింహం, ఎమ్‌డి జక్కీ పాల్గొన్నారు.


గణపవరంలో..

సర్పంచి సుబ్బారావు పనితీరు భేష్

ప్రజాశక్తి - కాళ్ల

సర్పంచి సుబ్బారావు గ్రామాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని, సర్పంచి పనితీరు అభినందనీయమని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు కొనియాడారు. సోమవారం దొడ్డనపూడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా రూ.70.70 లక్షలతో నిర్మించిన రెండు వాటర్ ట్యాంకులను ఎంఎల్ఎ ప్రారంభించారు. దొడ్డనపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సుమారు పది లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడను, వివిధ మొక్కలను సర్పంచి సుబ్బారావు ఆర్థిక సహకారంతో నిర్మించిన వాటిని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో జల జీవన్ మిషన్‌లో లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అనంతరం జరిగిన సభలో సర్పంచి సుబ్బారావు పుట్టినరోజు వేడుకలు ఎంఎల్ఎ కనుమూరు రఘురామకష్ణరాజు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. దొడ్డనపూడి గ్రామ సర్పంచి సుబ్బారావు పుట్టిన రోజున అభివద్ధి కార్యక్రమాలు, పలు ప్రారంభోత్సవాలు, పలు సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు.


కేక్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు


2024 అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించిన గ్రామాల్లో దొడ్డనపూడి గ్రామం ఉందన్నారు. రానున్న మూడేళ్లలో దొడ్డనపూడి గ్రామంలో నాలుగు కిలోమీటర్లు పొడవునా సిమెంట్ డ్రెయినేజీ నిర్మించాలని సర్పంచి సుబ్బారావు తన దృష్టికి తీసుకొచ్చారని, సమస్య పరిష్కరించాలనే సంకల్పంతో ఉన్నానని తెలిపారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులకు పెన్నులు, జామెంట్రీ బాక్సులు అందజేశారు. గ్రామస్తులందరికీ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, టిడిపి మండల అధ్యక్షులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపో రిటైర్డ్ ఉద్యోగులకు

పింఛన్లు ఇవ్వాలని ఎంఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆర్‌టిసి డిపో రిటైర్డ్ ఉద్యోగులు పొందుతున్నది అతి తక్కువ పెన్షన్ అని, ఆ పేరుతో తమకు వృద్ధాప్య పెన్షన్ నిరాకరించకుండా అర్హులందరికీ ఆర్‌టిసి విశ్రాంతి కార్మికులకు అందించాలని ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు కోరారు. భీమవరం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ఎస్ఎస్.రావు మాట్లాడుతూ సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన తమ కార్మికులకు పెన్షన్లు రూ.1000 మాత్రమే ఇస్తున్నారని, ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పింఛన్లకు అన్ని విధాలా అర్హత ఉందని, సమస్యను పరిష్కరించి ప్రభుత్వ వృద్ధాప్య పింఛన్లు ఇప్పించాలని కోరారు. దీనిపై ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, సంఘం సభ్యులు ఎన్.రంగారావు, నాగరాజు, బ్రహ్మజీ, కెఎన్.రాజు, ఎంవిఎస్ నారాయణ, అబ్రహం, చంద్రరావు పాల్గొన్నారు.


ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఘనంగా కొవ్వలి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలను పట్టణంలోని ఆయన నివాసంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రుస్తుంబాద లెప్రసీ కాలనీలో నిరుపేదలకు ఆయన భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. నరసాపురం ఏరియా ఆసుపత్రిలో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ అభిమానులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని రామ్మోహన్ నాయుడు ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర్ నాయుడు, నిమ్మకాయల బాబ్జి, గునిశెట్టి రామకృష్ణ, గుగ్గిలపు బుజ్జి, యర్రంశెట్టి నాగేశ్వరరావు, బర్రె మురళి పాల్గొన్నారు.


ప్రభుత్వాసుపత్రిలో రక్తదానం

మొగల్తూరు : మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలను అభిమానులు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్ల చంటి ఆధ్వర్యంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేకును ఆయన కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. పేద ప్రజలకు సేవ చేసేందుకే కొవ్వలి ఫౌండేషన్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, పాల రాంబాబు, దాసరి కృష్ణాజీ, ముక్క పుల్లయ్య, దేశంశెట్టి శ్రీను, మెండు రాజేష్, మైలాబత్తుల రాంబాబు పాల్గొన్నారు.

చోరీ సొత్తు కొనుగోలు నేరం

జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దొంగతనాలకు పాల్పడటం ఎంత నేరమో, దొంగ సొమ్మును కొనుగోలు చేయడమూ నేరమేనని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. కాపర్ వైర్ చోరీ కేసులో కాపర్ వైర్ కొనుగోలు చేసిన వారిని కూడా నిందితులుగా చేర్చి కేసు నమోదు చేశామని, దొంగ సొత్తు కొనుగోలు చేసే వారికి ఇది ఒక హెచ్చరిక అని ఆయన అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో విద్యుత్ ట్రాన్సఫార్మర్లు నుంచి రాగి వైరు చోరీకి గురవుతున్నట్లు బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్లో పలు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై బుట్టాయగూడెం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి ఎస్ఐ దుర్గామహేశ్వరరావు నిందితుల కోసం గాలింపు చేపట్టారన్నారు. ఈ క్రమంలో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారితోపాటు చోరీ సొత్తు కొనుగోలు చేసిన ఇద్దరిని కూడా గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. వైరు చోరీ చేసిన వారికి రూ.పది నుంచి రూ.15 వేలు సొమ్ము మాత్రమే లభిస్తుందని, కోల్పోయిన రైతులకు మాత్రం రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని ఆయన అన్నారు. ఈ కేసులో మొదటి నిందితునిగా ఉన్న గోపీకిరణ్ ఇప్పటి వరకూ 19 కేసుల్లో నిందితునిగా ఉన్నాడన్నారు. ఇక రెండో నిందితుడు జీలుగుమిల్లి ప్రాంతానికి చెందిన పోనుకుమాటి నరసింహారావుపై ఇప్పటి వరకు గోపాలపురం, నల్లజర్ల పోలీస్ స్టేషన్లో మూడు కేసుల్లో నిందితునిగా ఉన్నాడని తెలిపారు. మరో నిందితుడు జీలుగుమిల్లి ప్రాంతానికి చెందిన షేక్ హుస్సేన్ అని, వీరి నుంచి తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట ప్రాంతానికి చెందిన తోట శ్రీనివాసరావు, విజయవాడ ప్రాంతానికి చెందిన సతీష్‌కుమార్ రాగి వైరు కొనుగోలు చేసినట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. వీరందరినీ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో వీరి వద్ద నుండి దాదాపు 400 కేజీల రాగి వైరు రికవరీ చేసామని తెలిపారు. ఇకపై జిల్లాలో చోరీలకు పాల్పడేవారితోపాటు చోరీ సొత్తు కొనుగోలు చేసే వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన జీలుగుమిల్లి సిఐ వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం ఎస్ఐ దుర్గామహేశ్వరరావుతోపాటు సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE ::
(SENIOR DIVISION) :: KOVVUR
Creditos' I.P.No. 15 of 2024

Between:
M/s. Shriram Finance Limited,
(Formerly known as Shriram Transport Finance Company Ltd.,)
Jangareddigudem Branch, Rep.by its Special Power of Attorney Holder & Asst. Business Manager Mr. Rajasekhar, G., Eluru ....Petitioner
And
1) **Srilakshmi Uda,** W/o. Uda Satish Khanna, Age 33 yrs, female, Business, R/.o.H.No.4-24, Jonnavarigudem, Tadavai Sivaru, Jangareddigudem (M), Eluru dist.
2) **Kodali Swarajyalakshmi,** W/o. Sambasiva Rao, Age 65 yrs Female, House wife, R/o. Lakshmipuram, Ayyavari Polavaram (P), Jeelugumilli (M), Eluru dist.
3) **The Official Receiver,** West Godavari Dist., District Court Complex, Eluru, Eluru Dist. ...Respondents

1వ రెస్పాండెంట్, పిటీషనరు రాజమహేంద్రవరం సోల్ అర్బిట్రేటర్ వద్ద వేసిన ఎ.సి.నెం.192/2024 దర్మిలా అవార్డు పొందిన బాకీ ఎగవేయు ఉద్దేశ్యంతో తన తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని 2వ రెస్పాండెంట్ పేరున ది.13-3-2024వ తేదీన జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో డాక్యుమెంట్ నెం.7253/2024రు గా సేల్ డీడ్ దస్తావేజును రిజిష్టరీ చేయించినారు. సదరు విషయం తెలియవచ్చి పిటీషనరు రెస్పాండెంట్లపై పై కోర్టులో పై నెంబరు క్రెడిటార్ ఐ.పి. దాఖలు చేసి 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా గుర్తించి, 1వ రెస్పాండెంటు 2వ రెస్పాండెంటు పేరున రిజిష్టరీ చేసిన సేల్ డీడ్ దస్తావేజును రద్దుపరచమని ఐ.పి. దాఖలు చేసి ఐ.పి. దాఖలా 'ఎ' షెడ్యూలు అనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని 3వ రెస్పాండెంటు కస్టడీ లోనికి తీసుకుని మేనేజ్ చేయించి పిటీషనరు బాకీ వసూలు ఇప్పించమని కోరియున్నారు. ఇందుపై ఎవరికైనా, ఏమైనా అక్షేపణలు ఉన్న యెడల సదరు ఐ.పి. వాయిదా ది.**12-09-2024**వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు పై కోర్టు వారి సమక్షమున హాజరై అక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియపర్చడమైనది.

షెడ్యూలు: ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం యస్.ఆర్.ఓ. లిమిట్స్, తాడువాయి గ్రామ పంచాయతీ, తాడువాయి విలేజ్, జిరాయితీ మెర్క ఆర్.యస్.నెం.301-1బి, చ.గ.173-33లు ఖాళీ స్థలమునకు హద్దులు కొలతలు:-
తూర్పు: అ 26-0 లు 5 అడుగుల వెడల్పు గల రోడ్డు **దక్షిణం:** అ 60-0 లు ఉప్పులూరి రామారావు గారి స్థలము **పడమర:** అ 26-0 లు నెల్లూరి వీర రంగారావు గారు ఇతరులకు క్రియపర్చిన స్థలము **ఉత్తరం:** అ 60-0 లు కడలి సత్యనారాయణ గారి స్థలము

మేడూరి వి.యస్.కె. శ్రీనివాస్, అడ్వకేట్,
కొవ్వూరు, తూ.గో.జిల్లా.
సెల్: 97051 97335
కొవ్వూరు
ది.26-08-2024

విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు విరమించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వ్యవసాయ విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విరమించాలని, 2022 విద్యుత్ బిల్లును కేంద్రం రద్దు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా సమావేశం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లుల శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జమలయ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందన్నారు. అంపశయ్యపై ఉన్న రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తిరుమాని కామేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎం.లక్ష్మిపతి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలీని మహిళ మృతి

తాడేపల్లిగూడెం:రైలు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బాదంపూడి నుంచి చేబ్రోలు రైల్వే స్టేషన్ మధ్య చేబ్రోలు రైల్వే స్టేషన్ యార్డు వద్ద సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు గల గుర్తుతెలీని మహిళను రైలు ఢీకొంది. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. మృతురాలి ఒంటిపై లేత పసుపు రంగు టాపు, ఎరుపు రంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. మృతురాలు వివరాలు తెలియ రానట్లు తెలిపారు. ఆమె మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మార్చురీలో ఉంచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు తెలిస్తే తాడేపల్లిగూడెం రైల్వే పోలీస్‌స్టేషన్ 8019157528, 9948010061 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేరు మార్పు ప్రకటన

గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి : గుండుగొల్లు మహంకాళి, తల్లి : గుండుగొల్లు మీరమ్మ, భార్య : గుండుగొల్లు మార్త, డోర్‌నెం.15-9, పెదపేట చర్చి దగ్గర, ఉండి, ఉండి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును గుండుగోలును చంద్రశేఖర్ (పాతపేరు) తండ్రి గుండుగోలును మహంకాళి, తల్లి : గుండుగోలును మీరమ్మ, భార్య : గుండుగోలును మార్త నుండి గుండుగొల్లు చంద్రశేఖర్ (కొత్తపేరు) తండ్రి గుండుగొల్లు మహంకాళి, తల్లి : మీరమ్మ, భార్య : గుండుగొల్లు మార్త గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం.590/2022

బిట్వీన్:
బొడ్డు పద్మరాజు, S/o.ధర్మరాజు. హిందూ, పు. 39 సం.రం.లు, వ్యాపారం, 12వ వార్డు, తాడేపల్లిగూడెం,టిపిజి/పిజెసిజె ...వాది
మరియు
కరెడీ శామ్యూల్ జెమ్మి దైవ వరం, S/o. శామ్యూల్ జాన్, హిందూ, పు, 63 సం.లు, వ్యాపారం, డోర్ నెం.4-47-16, 7వ వార్డు, పి & టి కాలనీ, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా, టిపిజి/పిజెసిజె. ...ప్రతివాది

పై నెంబరు గ్రంథములో పిటీషనర్/వాది గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాల యాపన చేయుచున్నారనిన్నీ. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ది. 19-09-2024వ తేదీ గురువారం వాటికి వాయిదా వేసినారు. మీరు ఆ రోజు ఉదయం గం.10.30 ని॥ల లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, మీ వకీలు గారి ద్వారా గానీ హాజరు అయి మీ యొక్క అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
తాడేపల్లిగూడెం, **జి.వి.ద్వారకానాథ్**
తేది.28-08-2024 డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది.

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.116/2006 in
O.S.253/2005

DHR : కర్రి శ్రీను కుమారి
Vs
JDR's : బొందా మేరీరత్నం (Died) వగైరా
To.
2వ JDR :
B.Harshita Mounica, D/o.Bonda Mary Ratnam, W/o.Rajesh Babu, D.No.9-99/A, Kunchevari Street, Gummuluru, Poduru Mandal.

పై నెంబరు EP లో మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినప్పటికిన్నీ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువల్ల ఈ ప్రకటన ద్వారా సదరు E.P లోని నోటీసులు అమలు జరపటమైనది. కాబట్టి ది.4-9-2024 తేది. ఉ.10.30 ని॥లకు పై కోర్టులో మీరు హాజరై మీ యొక్క వాదనను దాఖలు చేసుకొవలెను. లేని యడల మీకు పరోక్షముగా తీర్పు చెప్పబడును.

By Order of Court
గునిశెట్టి శ్రీనివాసరావు
నర్సాపురం అడ్వకేటు, నర్సాపురం.
తేది.26-8-2024 సెల్: 9553126234